బీలరైతు బిజీబిజీ..

- జోరుగా ఖరీఫ్ వ్యవసాయ పనులు
- వర్షాలతో అన్నదాతల్లో ఆనందం



కపాసుకుద్ధిలో వరినాట్లు వేస్తున్న మహిళలు



పొలాన్ని చదును చేస్తున్న రైతు



నాట్లు వేసేందుకు నారును సిద్ధం చేస్తున్న కూలీలు

కవిటి: వరుణ దేవుడు కరుణించాడు. ఇచ్ఛాపురం నియోజకవర్గం వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలతో బీల రైతు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. వాస్తవంగా ఈ ఏడాది నారుమడుల కోసం విత్తనాలు వేసిన ప్రక్రియ జూన్ 20న కాస్తా ఆలస్యంగా ఆరంభమైంది. సోంపేట సబ్‌డివిజన్ పరిధిలో ఈఏడాది సకాలంలో పచ్చి రొట్ట పైర్ల కోసం జీలుగు, కట్టె జనుము విత్తనాలను అధికారులు సరఫరా చేశారు. వరి విత్తనాల పంపిణీ వ్యవసాయ శాఖ చేపట్టింది. ఇటీవల కురిసిన వర్షాలు అన్నదాతలో ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. పుడమితల్లినే నమ్ముకుని జీవనం చేస్తున్న రైతు కుటుంబాలు వరినాట్లు వేసేందుకు సన్నద్ధమయ్యాయి. ప్రస్తుతం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో అధికశాతంలో దమ్ములు, ఉబాలు వేసుకునే ప్రక్రియ సాగుతోంది. కంచిలి, సోంపేట మండలాల్లో నారుమడులు ఆలస్యంగా వేయడం కారణంగా నారు చేతికందకపోవడం వల్ల వరినాట్లు ఆలస్యంగా ప్రారంభించాల్సిన పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో ఈ ఏడాది వ్యవసాయ శాఖ అంచనవేసిన గణాంకాల ప్రకారం 36,540 ఎకరాల్లో వరినాట్లు పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి సోంపేట వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఇచ్ఛాపురం, కవిటి మండలాల పరిధిలో ముందుగా వరినాట్లు వేసే పరిస్థితి ఏటా జరుగుతుంటుంది. ఈఏడాది కూడా అదేరీతిలో వరినాట్లు ఈ రెండు మండలాల పరిధిలో సాగుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారుల అంచనాల ప్రకారం ఇచ్ఛాపురం మండలంలో 85 హెక్టార్లలో, కవిటి మండలంలో 32 హెక్టార్లల్లో ఇప్పటి వరకు వరినాట్లు వేసే ప్రక్రియ పూర్తికావచ్చిందని ఉన్నతాధికారులకు నివేదించారు. సోంపేట సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో వెదజల్లే విధానం రమారమీ 100 ఎకరాల్లోపే ఉంటుందనేది అంచనా. వాస్తవానికి నాలుగు మండలాల బీలప్రాంతాల పరిధిలో 3000 ఎకరాల్లో ఖరీఫ్ వరి ప్రక్రియ జోరుగా సాగుతుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది పీఏసీఎస్, డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా కూడా ఎరువులు అందించాలనే ఆలోచనలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

సకాలంలో ఖరీఫ్ ప్రణాళిక



సోంపేట సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఈ ఏడాది 36,540 ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం ఉంటుందన్న అంచనాలతో విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువుల పంపిణీకి కార్యాచరణ చేపట్టాం. ప్రస్తుతం వర్షాలకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతు సేవా కేంద్రాల పరిధిలో వచ్చిన స్టాక్ మేరకు యూరియా, డీఏపీ తదితర ఎరువులను కేటాయించాం. పూర్తిస్థాయిలో సకాలంలో అనుకున్న ప్రణాళిక మేరకు ఖరీఫ్ కార్యాచరణ చేపడతాం.
– కె.జగన్మోహనరావు, ఏడీఏ, సోంపేట సబ్‌డివిజన్

సొంత విత్తనాలకే ప్రాధాన్యం



మాకున్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది 1262, యూటీఆర్ 181 రకం వరిసాగును చేపట్టాను. సొంతంగానే విత్తనాలను సిద్ధం చేయడం మా నాన్న తరం నుంచి వస్తున్న సంప్రదాయం పాటిస్తున్నాను. గత ఏడాది రైతులకు నావద్ద పండించిన పలురకాల విత్తనాల్ని అందించాను. ఈ ఏడాది కూడా ఆదిశగా ఆలోచనతో ముందుకు సాగుతున్నాను. – బెందాళం వరప్రసాదరావు, ప్రగడపుట్టుగ, కవిటి మండలం

క్లుప్తంగా

ఎరువులు అందజేత

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామసచివాలయం పరిధిలోని రైతులకు డీఏపీ ఎరువుల బస్తాలను మంగళవారం అందజేశారు. ఖరీఫ్ వరి పనులు చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో రైతాంగానికి ఎరువుల్ని రైతు సేవా కేంద్రం ద్వారా అందుబాటు లోకి తీసుకువచ్చామని సర్పంచ్ ఎస్పీ నారాయణ స్వామి, జెడ్పీటీసీ సభ్యుడు పొందల కృష్ణారావు అన్నారు. రైతులు ముందస్తుగా ఆర్డర్ చేసుకున్న మేరకు వీటిని అందరికీ అందుబాటులో ఉంచినట్టు వ్యవసాయశాఖ సహాయకురాలు బొర్ర అమూల్య తెలిపారు.

ప్రహరీ మంజూరు చేయాలి

కవిటి: మండలంలోని ఆర్‌బెలగాంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారుల రక్షణ కోసం ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టీడీపీ నేతలు సంతోష్ పట్నాయక్, బాసుదేవరౌళో, మణిచంద్రప్రకాష్, రంగారౌళో కోరారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఇచ్ఛాపురం రూరల్ ప్రాజెక్ట్ ఐసీడీఎస్ పీవో పురాణం నాగరాణికి వినతిపత్రం అందించారు. విషయాన్ని జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని ఆమె అన్నారు.

విద్యార్థినికి సన్మానం

సంతబొమ్మాళి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ద్వితీయ స్థానంలో సంతబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సాధు దేవి నిలిచింది. దీంతో ఆమెను మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మంగళవారం సన్మానించి నగదు బహుమతి అందజేశారు. మండల విద్యాశాఖాధికారులు జలుమూరు చిన్నవాడు, అర్జునుడు, ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు, మనబడి ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, జగదీష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురంలో సీసీ రహదారి నిర్మాణానికి మాజీ ఎంపీపీ, ప్రస్తుత సర్పంచ్ గొరకల సంతరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. రైస్ మిల్ జంక్షన్ నుంచి దున్న గంగయ్య తోట వరకు పంచాయతీ నిధులు సుమారు రూ.2.30 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గర్తం దానేష్, కళిశెట్టి గోపాల్, జి.లోకరాజు, గొకల మాధవరావు, కె.దేవదాసు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకంపై సమీక్ష

కోటబొమ్మాళి: కేంద్ర ప్రభుత్వం కులవృత్తులవారి కోసం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకంపై కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్షించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులపై విచారణ చేసి అర్హత ఉన్నవారి జాబితాను అప్రోవల్ చేయాలని సూచించారు. అలాగే ఇంటి పన్ను, పీఆర్ ఒన్ యాప్ నిర్వహణపై దృష్టిసారించాలన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

కాశీబుగ్గ: జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు పలాస రైల్వే చైల్డ్ హెల్ప్ డెస్క్ సభ్యులు మానవ అక్రమ రవాణాపై రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రయాణికులకు మంగళవారం అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా జరిగితే 1098కు సమాచారం ఇవ్వాలని ప్రతినిధులు అన్నారు. జీఆర్‌పీ హెచ్‌సీ కోదండరావు, కానిస్టేబుళ్లు అనిత, రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ బాల సరస్వతి ఉన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

టెక్కలి: హెల్మెట్‌ధారణ వలన కలిగే మంచిని ప్రతీ వాహనదారుడు తెలుసుకోవాలని టెక్కలి కోర్టు సముదాయం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద అన్నారు. హెల్మెట్ ధారణ వలన కలిగే ప్రయోజనాలపై మంగళవారం తొలుసూరుపల్లి, ఎన్‌టీఆర్ నగర్, కచేరివీధి, శ్రీనివాసనగర్ కూడళ్లలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎం.గోవింద్, పి.మధుబాబు, ఎల్.బాలకృష్ణ, ఆర్.ప్రభుచంద్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు వినతి

కాశీబుగ్గ: కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి తమకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 2003 డీఎస్సీ బ్యాచ్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను తన గృహంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

ప్రతిభ చూపిన వారిని ప్రేరణగా తీసుకోండి



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ ఈవో విలియమ్స్, ఉపాధ్యాయులు

నందిగాం: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల, మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రేరణగా తీసుకొని ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాలని టెక్కలి డిప్యూటీ ఈవో పి.విలియమ్స్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ (257) నందిగాం శాఖవారి ఆధ్వర్యంలో మొదటి సారి మండలస్థాయి పదో తరగతి విద్యార్థలకు ప్రతిభా పురస్కారాలను మంగళవారం అందజేశారు. సభాధ్యక్షులుగా ఎం.మల్లేశ్వరరావు వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి.నర్సింహులు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్‌కుమార్, మండలశాఖ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. డిప్యూటీ ఈవో మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభం నుంచే విద్యార్థులు క్రమపద్ధతిలో చదవాలన్నారు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలల్లో, ఒక కేజీబీవీ, ఒక బాలికల గురుకులం, రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను, వారి తల్లిదండ్రులను సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. అలాగే మండలస్థాయిలో 576 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన కవిటి అగ్రహారానికి చెందిన గుమ్మడి సోనియాకు రూ.3 వేలు నగదుతో పాటు జ్ఞాపికను, 571 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన పెద్దతామరాపల్లికు చెందిన బార్నన జ్యోత్స్నకు రూ.2 వేలుతో పాటు జ్ఞాపికను, 570 మార్కులతో మూడవ స్థానంలో నిలిచిన తురకులకోటకు చెందిన సూర మోహిత్, కవిటి అగ్రహారానికి చెందిన రోణగల ధరణిలకు చెరో వెయ్యి రూపాయిలతో పాటు జ్ఞాపికలను అందజేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కేసులు

- అవగాహన సదస్సులో సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజ్



మాట్లాడుతున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజ్

ఇచ్ఛాపురం రూరల్: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఇచ్ఛాపురం సీఐ టి.ఇమ్మాన్యుయేల్ రాజ్ అన్నారు. రూరల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా పోలీసులు, ఐసీడీఎస్, వైద్య, పంచాయతీ, గ్రామ సచివాలయం సిబ్బందితో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌతికంగా శరీరాన్ని తాకటం, శారీరకంగా కలవాలని అభ్యర్థించడం, బలవంతం పెట్టడం, శృంగారపరమైన చేష్టలు, సంభాషణలు, అసభ్యకర సైగలు, ద్వందార్థాలుగా మాట్లాడటం వంటి తదితర చర్యలకు పాల్పడితే నెల రోజులలోపు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నల్ కంప్‌లెయింట్స్ కమిటీ (ఐసీసీ), లోకల్ కంప్‌లెయింట్ కమిటీ(ఎల్‌సీసీ)లతో లైంగిక వేధింపులను నిరోధించే కమిటీలను వేయడం జరిగింది. సీడీపీఓ పురాణం నాగరాణి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఎంఈవో కురమాన అప్పారావు, న్యాయవాది నాగరాజు పాత్రో, మండల వైద్యాధికారిణి డాక్టర్ రమ్యారెడ్డి, మండల వ్యవసాయాధికారి టి.భార్గవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విత్తన బంతులతోనే వనాలు అభివృద్ధి



విత్తన బంతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పలాస: విత్తన బంతులతోనే వనాలను అభివృద్ధి చేయగలమని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.ఈశ్వరరావు చెప్పారు. బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ హరిత దళం క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ ప్రతినిధులు బంకమట్టి, సేంద్రీయ ఎరువు, స్థానికంగా దొరికే చింత, మామిడి, ఉసురి, నేరేడు, వేప, పనస తదితర విత్తనాలతో ప్రతి విద్యార్థి పది చొప్పున ఐదు వేలు విత్తన బంతులను తయారు చేశారు. వర్షం పడే సమయంలో వీటిని రహదారులకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలు, కొండ ప్రాంతాల్లో వెద జల్లుతారు. అవి మొలకెత్తి అందులోని ఎరువును ఉపయోగించుకొని వృక్షాలుగా ఎదుగుతాయి. ఈ విధంగా వృక్షాలు దట్టంగా ఉండటం వల్ల జీవ వైవిధ్యంతో పాటు పర్యావరణ సమతుల్యత బాగా ఉంటుందని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఈశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటరు కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



డీజీపురంలో రంగారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలో వివిధ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, నాయకులు మంగళవారం పరామర్శించారు. కొరికానపుట్టుగ గ్రామానికి చెందిన కొరికాన మోహినమ్మ, డి.జి.పురం గ్రామానికి చెందిన బిష్ణు నాయకో, కరగాన రంగారావు అనారోగ్యంతో మృతిచెందారు. ఈ కుటుంబాను ఎంపీపీతోపాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు, లడ్డు కేశవపాత్రో, ఎలుసూరి అప్పారావు ఉన్నారు.

ప్రజా పంపిణీ విధానంపై అభిప్రాయ సేకరణ



బలియాపుట్టుగలో అభిప్రాయ సేకరణ చేస్తున్న సీఎస్‌డీటీ కూర్మారావు

కంచిలి: పౌరసరఫరాల శాఖ విభాగం ద్వారా నిర్వహిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రస్తుతం ఉన్న విధానంలో రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాల ద్వారా రేషన సరకులు పంపిణీ, అంగన్‌వాడీ సెంటర్లకు, మధ్యాహ్న భోజన పథకాలకు సరకులు పంపిణీపై ప్రజాభిప్రాయ సేకరణను మంగళవారం చేపట్టారు. ప్రస్తుతం ఉన్న విధానం ఎలా ఉందనేది రేషన్ కార్డుదారులను బలియాపుట్టుగ రేషన్ డిపో పరిధిలో సీఎస్‌డీటీ పి.కూర్మారావు విచారించారు. వీరంతా ఈ విధానం వలన సంతృప్తికరంగానే సరకులు పంపిణీ జరుగుతుందని చెప్పారు.

కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



నిరసనలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

కాశీబుగ్గ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాశీబుగ్గ పాతబస్టాండ్ వద్ద గాంధీ విగ్రహం ఎదుట మంగళవారం ధర్నా చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు ఎస్.గణపతి, సీహెచ్ వేణుగోపాల్, వంకల మాధవరావు, దున్న శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించక పోవడం నేరమని అన్నారు. గ్రామీణ పేదలకు అండగా నిలిచే ఉపాధి హామీ చట్టం అమలుకు నిధులు కొరత విధిస్తే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేస్తుండగా ఎస్సై పారినాయుడు, పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు టి.అజయ్‌కుమార్, బి.వాసుదేవరావు, వి.పాపయ్య, నాగేశ్వరరావు, లోకనాథం, ఢిల్లేశ్వరి, భీమారావు ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ: కాశీబుగ్గ–పలాస మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిల్ సభ్యులు పారిశుద్ధ్య సమస్యను సమావేశంలో ప్రస్తావించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీ మురికిపాలిటీగా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ సమస్యపై అప్పటి ప్రజాప్రతినిధులను ఎందుకు అడగలేదని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి గతంలో ఎంపీ నిధులను కేటాయిస్తే పలాస నియోజకవర్గంలో ఆ నిధులు వినియోగించకుండా అప్పటి ప్రజాప్రతినిధి అడ్డుపడడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 27వవార్డు కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ.. పలు శాఖల అధికారులు సమావేశానికి ఎందుకు హాజరు కావడం లేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. 10వవార్డు కౌన్సిలర్ శర్వాణ గీత మాట్లాడుతూ.. వార్డులలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని అన్నారు. కౌన్సిలర్లు మాధవరావు, తులసీ, ఆశాలతలు మాట్లాడుతూ.. కాలువలు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యలను ప్రస్తావించారు. తమ వార్డులో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదని వైస్ చైర్మన్ మీసాల సురేష్ అన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం: ఆడికృత్తికను పురస్కరించుకుని సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వల్లిదేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఉపాలయం వద్ద పూజా కార్యక్రమాలు జరిగాయి. మహిళలు కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం పురవీధుల్లో తిరువీధి కార్యక్రమాన్ని ఆర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వినతి



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కోటబొమ్మాళి: పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు యూటీఎఫ్ నాయకులు కోటబొమ్మాళి ఎంఈవో ఎస్.అప్పలరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ ప్రతినిధులు గొండు నారాయణరావు, పంగ సోమశ్వరరావు ఉన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు.

9 వాహనాలు వేలం

సోంపేట: వివిధ కేసులో పట్టుబడిన వాహనాలకు సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం ఆవరణలో మంగళవారం వేలం నిర్వహించారు. పలాస ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఐ.ఎ.బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో తొమ్మిది ద్విచక్ర వాహనాలు అమ్ముడైనట్టు సీఐ జైభీమ్ తెలిపారు. వేలం ద్వారా 1,36,058 రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందన్నారు.

పాత్రకొండలో పొలంబడి

సోంపేట: పంట సాగులో ఖర్చు తగ్గించి, రైతుకు లాభాలు అందించడానికి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి అన్నారు. పాత్రకొండలో 25 ఎకరాల్లో పొలంబడిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సేంద్రీయ పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకులు కుమారి, ఉష, ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ మండల సమన్వయకర్త కుమారి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కోటబొమ్మాళి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ, స్టేషన్ సిబ్బంది ఎస్పీకి సాదరంగా ఆహ్వానం పలికారు. ముందుగా స్టేషన్‌లోని పలు రికార్డులను, స్టేషన్ ఆవరణను పరిశీలించారు. అనంతరం కేసుల వివరాలు, సిబ్బంది సంక్షేమం గురించి ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలని, హైవేలపై జరుగు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, నిరంతర గస్తీ చేస్తూ నేర నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

సోంపేట: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ సంఘ సమావేశాన్ని పెద్దకోమటి వీధి పాఠశాల ఆవరణలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు, 117 జీవో రద్దు చేయాలన్నారు. సోంపేట, కంచిలి మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాలిబందు, చంద్రశేఖర్, శంకర్, తారకేశ్వరరావు, రాష్ట్ర స్థాయి నాయకులు శరత్‌బాబు, రమేష్ కుమార్ పాణిగ్రాహి, సాంబమూర్తి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నూతన కార్యవర్గం

టెక్కలి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా మదన్‌కుమార్, టెక్కలి కన్వీనర్‌గా విశ్వనాథ్‌తో పాటు మరికొంత మందికి కార్యవర్గంలో అవకాశం కల్పించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని కమిటీ సభ్యులు వెల్లడించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కె.మురళి, పెంచలయ్య పాల్గొన్నారు.